క్లుప్తంగా

ఓటేసిన కమిషనర్



ఓటు వేస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): పట్టభద్రులఎమ్మెల్సీ ఎన్నికల్లో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నగరంలోని దామోదరం సంజీవయ్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలుచుని తన ఓటు వేశారు.

ఓటర్లకు కృతజ్ఞతలు

కర్నూలు(రాజ్‌విహార్): శాసనమండలి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య, పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లు ఎండను సైతం లెక్క చేయకుండా క్యూలో నిల్చుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, దీంతో పోలింగ్ శాతం పెరిగిందని వెల్లడించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు ఉపాధ్యాయ ఎన్నికల్లో కూడా ఓటర్లు ఉత్సాహం చూపడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఇసుక పాలసీని సరళతరం చేయాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పన కోసం ఇసుక పాలసీని సరళతరం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు డిమాండ్ చేశారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భవన నిర్మాణాలు కొనసాగాలంటే 25 రకాల కార్మికులు అవసరమన్నారు. వీరందరూ పనిచేయాలంటే ఇసుక ముఖ్యమన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, నాయకులు జాన్ విల్సన్, కె.సత్యనారాయణ, బజారన్న, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

సాధనతో క్రీడల్లో రాణింపు

కర్నూలు(టౌన్): క్రీడల్లో నిత్య సాధన ద్వారా రాణించగలుగుతారని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు బి.రామాంజనేయులు అన్నారు. రెండు రోజులుగా స్థానిక యూనైటెడ్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు ఆయన మెడల్స్ అందజేసి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు భర్తీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ఇమాం ఏ ఆజం అబూ హనీఫా సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): ఇమాం ఏ ఆజం అబూ హనీఫా రజిఅల్లాహు అన్హు జీవిత చరిత్రపై మంగళవారం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సెంట్రల్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనుషులను శాంతి వైపు నడిపేందుకు అహలే సున్నతుల్ జమాత్, సెంట్రల్ ఈద్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం 7 గంటలకు (మగ్రిబ్ నమాజు తరువాత) స్థానిక ఉస్మానియా కళాశాల సమీపంలోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో సభ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి జామియా నిజామియా నక్షబంది, ఖతీబే హిందుస్తాన్ అల్లమా మౌలానా మొహమ్మద్ అహ్మద్, ప్రముఖ మత గురువు మౌలానా ఆసిఫుద్దీన్ ఖాద్రీ హాజరై ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఏప్రిల్ 4న చాగంటి కోటేశ్వరరావు రాక

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఏప్రిల్ 4న నంద్యాలకు రానున్నట్లు మన ఊరు-మన గుడి, మన బాధ్యత నిర్వాహకులు శివకుమార్ రెడ్డి, రాంప్రసాద్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక సందేశం ఇవ్వడానికి రానున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, బలగం, తూ జూఠీ మై మక్కర్, 65
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : ఆర్‌ఆర్‌ఆర్, సార్, 65
మిస్టర్ కళ్యాణ్ : నేడు విడుదల, దోచేవారెవరురా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : తూ జూఠీ మై మక్కర్, క్రీడ్ -3, 65, స్క్రీమ్ – 6, సీఎస్ఐ సనతాన్, ట్యాక్సీ
భరత్ కాంప్లెక్స్ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ, వినరో భాగ్యము విష్ణు కథ
రాజ్ : సీఎస్ఐ సనతాన్
శ్రీరామ : సింహ
విజయ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ

● జిల్లాలో పనిచేసే ఓ ప్రభుత్వ ఉద్యోగి తన 22 ఏళ్ల వయస్సులో ఓ యువతిని శారీరకంగా కలిశాడు. ఆమె అతనిని సెక్స్‌కు పనికిరావని చెప్పడంతో 20 ఏళ్ల పాటు అపనమ్మకంతో పెళ్లి చేసుకోలేదు. మధ్యలో సామర్థ్యం పెంచే మందులు కొని వాడినా ఉపయోగం లేకుండా పోయింది. కుటుంబసభ్యులు పెళ్లికి ఒత్తిడి చేయడంతో ఇటీవల ఓ యురాలజిస్టును సంప్రదించగా కౌన్సిలింగ్ చేసి కొన్ని సూచనలు చేసి పంపించాడు. ఇప్పుడతను పెళ్లి చేసుకుని భార్యతో సంతోషంగా ఉన్నాడు.

● ఆదోనికి చెందిన ఓ యువకునికి ఇటీవలే వివాహమైంది. అయితే మొదటి రాత్రే భార్యను సరిగ్గా సుఖపెట్టలేకపోయానని ఆయనకు అపనమ్మకం ఏర్పడింది. యురాలజిస్టును కలిసి తన సమస్యను వివరించాడు. నీవు తరచూ బ్లూఫిల్మ్‌లు, ఫోర్న్ వీడియోలు చూడటం వల్ల అలా అనిపిస్తోందని, ఆ వీడియోల్లో జరిగినట్లు నిజజీవితంలో ఉండదని వివరించి చెప్పాడు. కాబట్టి నీ శక్తి సామర్థ్యాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఎలాంటి మందులు అవసరం లేదని చెప్పి కౌన్సెలింగ్ చేశాడు.

వీరిద్దరే కాదు చాలా మంది తమ సెక్స్ సామర్థ్యాలపై నమ్మకం లేక నిరుత్సాహపడుతున్నారు. ఫోర్న్ వీడియోల వలే తాము శక్తి చూపించాలని విచ్చలవిడిగా మందులు వాడుతూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవలే రక్తంలో వేగం పెరిగి ఓ యువకుడు గుండెపోటుకు గురికాగా, మరో యువకుడు స్ట్రోక్ వచ్చి ఆసుపత్రిలో చేరాడు.

- సామర్థ్యం పెంచే మందులు వాడకం
- వైద్యుల సూచన లేకుండానే వినియోగం
- బ్లూ ఫిలింలు, ఫోర్న్ వీడియోల ప్రభావం
- జిల్లాలో ఏటా రూ.5 కోట్ల మందుల విక్రయం
- అతిగా వాడితే ప్రాణాంతకమంటున్న వైద్యులు
- సమస్యలుంటే వైద్యులను కలవాలని సూచన

ఆ శక్తి లేక..



కర్నూలు(హాస్పిటల్): ఈ సృష్టిలో జన్మించిన ప్రతి జీవికీ సెక్స్ అనేది నిత్యావసరం. ఇందులో జంతువులకు విచక్షణ ఉండదు. మనుషులకు తెలివితేటలు ఉంటాయి కాబట్టి విచక్షణతో జీవించాల్సి ఉంటుంది. ఈ మేరకు కొన్ని కట్టుబాట్లు ఏర్పరుచుకున్నారు. ఆ పరిధిలోనే శృంగార కార్యక్రమాలు నిర్వర్తించాలని నియమాలు పెట్టుకున్నారు. అవి కూడా వారి ఆరోగ్యం కోసమే పెద్దలు ఉంచారు. అయితే, కొందరు ఈ నియమాలు, కట్టుబాట్లను కాలదన్నుతున్నారు. పెళ్లిగాకుండానే శృంగారాన్ని రుచిచూస్తున్నారు. మరికొందరు పెళ్లైనా మరింత సుఖం కోసం అడ్డదార్లు తొక్కుతున్నారు. ఈ మేరకు బయటి ప్రపంచంలో సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి క్రమంలోనే తమ శక్తి సామర్థ్యాలను మరింత పెంచుకోవాలని మందులు వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

మానసిక ఒత్తిడితో బలహీనం

ఇటీవల అటు ఉన్నత చదువులు, ఇటు ఉద్యోగాల కారణంగా సమాజంలో అధిక శాతం ప్రజలు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ క్రమంలో వారికి వివాహమైనా అధిక శాతం ఉద్యోగానికే సమయం కేటాయిస్తున్నారు. దీంతో రాత్రి ఇంటికి అలసిపోయి రావడంతో నీరుగారిపోతున్నారు. భార్యతో శృంగారంలో తృప్తి చెందలేకపోతున్నారు. అలాగే భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే శృంగారంలో పాల్గొనేందుకు, మనసువిప్పి మాట్లాడుకునేందుకు వారికి సమయం ఉండటం లేదు. దీంతో మొక్కుబడిగా కార్యక్రమాన్ని కానిచ్చేస్తున్నారు.

బ్లూఫిలింలు, ఫోర్న్ వీడియోలు చూస్తూ...

పాతికేళ్ల క్రితం శృంగార విషయాలు తెలుసుకోవాలంటే కేవలం పుస్తకాలు లేదా నీలిచిత్రాలు ఆధారం. కానీ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక అరచేతిలోనే సమస్తం కనిపిస్తోంది. ఇంటర్‌నెట్‌లో ఎక్స్ అని కొట్టగానే వందలాది నీలిచిత్రాలు, ఫోర్న్ వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి. యువత దీనికి ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. టీనేజీలోనే వీటిని చూస్తూ ప్రత్యక్షంగా అనుభవించాలని అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరు మధ్యవయస్సువారు, వృద్ధులు సైతం ఫోర్న్ వీడియోలు, నీలి చిత్రాలను చూస్తూ అక్కడి చిత్రాలకు, వారి సొంత క్రియలకు పోల్చి చూసుకుని నిరుత్సాహ పడుతున్నారు.

మందుల దుకాణాల్లో మాత్రలు కొని..

చాలా మంది తమ శక్తి సామర్థ్యాలపై నమ్మకం లేక, ఫోర్న్ వీడియోలు చూసి తాము అలాగే చేయాలని భావించి మందుల దుకాణాలకు వెళ్లి వయాగ్రా లాంటి మాత్రలు కొంటున్నారు. ఆయా దుకాణాలకు ఒకటి, రెండుసార్లు వీరు వెళ్లడం చూసిన యజమానులు వారు వచ్చిన వెంటనే గుర్తించి మాత్రలు పేపర్‌లో చుట్టి ఇస్తున్నారు.ఫోర్న్‌వీడియోల్లో మాదిరిగానే తాము శక్తి చూపాలని భావించి మోతాదుకు మించి మందులు వాడుతున్నారు. ఈ వ్యాపారం ఏటా రూ.5 కోట్లకు మించి సాగుతున్నట్లు అంచనా. అధిక శాతం జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లోని మెడికల్‌షాపుల్లో ఎలాంటి ప్రిస్కిప్షన్ లేకుండా సామర్థ్యం పెంచే మాత్రలను విక్రయిస్తున్నారు. కోవిడ్ సమయం నుంచి వీటి విక్రయాలు మరింత పెరిగినట్లు పలువురు దుకాణ యజమానులు చెబుతున్నారు.

మోతాదుకు మించి వాడితే ప్రాణాంతకం

సాధారణంగా వయసుపైబడిన వారికి వైద్యులు ఈ మందును సిఫారసు చేస్తారు. కానీ వివాహమైన తొలినాళ్లలోనే మరింత శక్తి సామర్థ్యాల కోసం ఈ మందులు కొందరు వాడుతున్నారు. దీనివల్ల అంగస్తంభన కలిగించడంలో సత్ఫలితాలను ఇస్తున్నప్పటికీ మోతాదుకు మించి వాడితే తలనొప్పి, చూపు మందగించడం , రక్తపోటు, నిద్రలేమి, కొన్నిసార్లు ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వైద్యుల సూచన లేకుండా వాడొద్దు



ఇటీవల కాలంలో చాలా మంది శృంగారంలో తమ శక్తి సామర్థ్యాలను రెట్టింపు స్థాయిలో చూపేందుకు మాత్రలు కొని వాడుతున్నారు. వైద్యుల సూచన లేకుండా అవి వాడితే ప్రాణాంతకం అవుతుంది. ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే ముందుగా యురాలజిస్టు లేదా ఆండ్రాలజిస్టులను కలిసి వివరించాలి. దాంతో పాటు ఎలాంటి జబ్బులున్నాయి, ఏ మందులు వాడుతున్నారో చెబితే దానికి అనుగుణంగా పరిశీలించి మందులు సూచిస్తారు.

–డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి,
యురాలజిస్టు, కర్నూలు

ప్రిస్కిప్షన్ లేకుండా మందులిస్తే చర్యలు



శృంగారంలో శక్తి సామర్థ్యాలు పెంచేందుకు గాను ఇటీవల కొన్ని దుకాణాల్లో మందులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఇలా చేయడం తప్పు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా ఇలాంటి మందులు విక్రయించకూడదు. మోతాదుకు మించి మందులు వాడటం వల్ల సదరు వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురైతే మందుల దుకాణదారుడు సైతం బాధ్యత వహించాల్సి ఉంటుంది. సదరు దుకాణాలపై తీవ్ర చర్యలుంటాయి.

–హరిహరతేజ,
డ్రగ్ ఇన్‌స్పెక్టర్, కర్నూలు

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం



ఎస్టీబీసీ కాలేజీ పోలింగ్ బూత్‌లో గ్రాడ్యుయేట్ ఓటు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో ఓటు వేస్తున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ కళాశాలలో 275వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఓటును వినియోగించుకున్నారు.అంతకుముందు కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటు హక్కును కూడా వినియోగించుకున్నారు. ఆ తర్వాత కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సతీమ ణి విజయలలిత ప్రకాశ్‌నగర్ టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ స్కూల్‌లో గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, డాక్టర్ అలంపూర్ మధుసూదన్ ఘన విజయం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు.

● ఓటేసిన కర్నూలు ఎంపీపీ

కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ సోమవారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో స్థానిక సంస్థల ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులందరూ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ఎగువ నుంచి 1,050 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పరిశీలకుడి నియామకం

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలకు కర్నూ లు, నంద్యాల జిల్లాలకు పరిశీలకుడిగా ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ డైరెక్టర్ ఆర్.నరసింహారావును నియమిస్తూ పాఠశాల విద్య కమిషన ర్ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే నెల 3 నుంచి పరీక్షలు జరగనున్నాయి.



సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉన్న ఓటర్లు

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఎంతో ఉత్సాహంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు



బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీలు



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటేస్తున్న కర్నూలు నగర కార్పొరేటర్లు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జైలుశిక్ష

కర్నూలు(లీగల్) : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. అనంతపురం జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌గా పనిచేస్తూ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగంపై బసిరెడ్డి ఓబుల్‌రెడ్డిపై 2013 సంవత్సరంలో అప్పటి ఏసీబీ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో బి.ఓబుల్‌రెడ్డిపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. ఆదాయానికి మించి అక్రమంగా రూ. 81,42,946 (339.947 శాతం) ఆస్తులున్నట్లు అందులో పేర్కొన్నారు. విచారణలో అక్రమ ఆస్తులు నిరూపణ కావడంతో అయనకు 4 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.5 లక్షల జరిమానా విధించారు. అక్రమంగా కలిగి ఉన్న ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని న్యాయమూర్తి బి.సునిత తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున రాంభగవాన్ వాదించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందవరం: రోడ్డు ప్రమాదంలో గురజాల గ్రామానికి చెందిన కురువ రామాంజినేయులు(36) మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఎరిగెర గ్రామ సమీపంలో మోటారు సైకిల్ కిందపడి రామాంజినేయులు, మామ జయరాముడు గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడ్డ రామాంజినేయులు రాయచూరు ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. సోమవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు ఎరిగెర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు శివశంకర్, జగన్ ఉన్నారు. రామాంజినేయులు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు విలపించారు.

సెబ్ విస్తృత దాడులు

వెల్దుర్తి: మండల పరిధిలోని సిద్దినగట్టు, బోయనపల్లెలో సోమవారం కోడుమూరు సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. వెల్దుర్తి పోలీసులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన దాడులలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల నాటుసారా, కర్ణాటక మద్యం 62 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు గ్రామాలకు చెందిన నిందితులు ఐదుగురిని అరెస్ట్ చేసి డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సెబ్ సీఐ శ్యాం ప్రసాద్ తెలిపారు.

డబ్బు అడిగినందుకు దారుణం

● మేనల్లుడి చేతిలో మామ హత్య



మృతి చెందిన తిరుపతి

రుద్రవరం: సొంత సోదరి కుమారుడే కదా అని నమ్మి డబ్బులిచ్చాడు. 'అవసం ఉంది నా డబ్బు నాకివ్వు' అని అడిగినప్పుడల్లా కాలయాపన చేస్తున్నా సర్దుకుపోతూ వచ్చాడు. ఇంటి నిర్మాణానికి అత్యవసరం కావడంతో కచ్చితంగా ఇవ్వాలని కోరాడు. అంతే.. మేనమామ అనే కనికరం కూడా లేకుండా అల్లుడే కర్రతో తలపై మోది హత్య చేశాడు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక బెస్త కాలనీకి చెందిన యంగమ్మ, తిరుపతి(35) అక్కా తమ్ముడు. వీరిద్దరికీ పెళ్లిళ్లు కావడంతో వేర్వేరుగా కాపురం ఉంటున్నారు. కొంత కాలం క్రితం తిరుపతి తన పొలాన్ని విక్రయించగా వచ్చిన డబ్బును సోదరి యంగమ్మ కుమారుడు మల్లేష్ తన వద్ద ఉంచుకున్నాడు. అడిగినప్పుడల్లా ఇప్పుడిస్తా అప్పుడిస్తా అంటూ వాయిదా వేస్తూ వస్తున్నాడు. ఈక్రమంలో తిరుపతి కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. సామగ్రి కొనాల్సి ఉందని, తన డబ్బు తనకు ఇవ్వాలని అల్లుడిని కోరాడు. పదేపదే వాయిదా వేస్తే తన ఇంటి నిర్మాణం నిలిచిపోతుందని వేడుకున్నాడు. అయినా ఏ మాత్రం జాలి లేకుండా కర్రతో తలపై మోదాడు. అతడు తీవ్ర రక్తస్రావమై కుప్పకూలి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. తిరుపతికి భార్య మల్లేశ్వరి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కాగా పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

గర్భిణులు, బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించాలి



యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. సోమవారం ఆయన నగరంలోని రోజా-1, స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 వారాల్లోపు కచ్చితంగా గర్భిణిని నమోదు చేసుకుని సమయానుసారంగా ఇవ్వాల్సిన ఆరోగ్య సేవలను అందించి కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని కుటుంబ సభ్యులతో చర్చించి బర్త్‌ప్లానింగ్ వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఒక వేళ గర్భిణికి ప్రమాదకర చిహ్నాలు గుర్తించినట్లయితే వారిని సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రికి వారి కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే రెఫర్ చేసి, ఆ వివరాలను కూడా ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి వారి ఇంటి వద్ద ఫాలో అప్ ఆరోగ్య సేవలు అందించి, ఫీడ్‌బ్యాక్ వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 14వ తేదీన ఒకటి నుంచి 5 ఏళ్లలోపు పిల్లలను, బడి బయట పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరు నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు, కిశోర బాలబాలికలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు చప్పరించి నమిలి మింగేటట్లు చూడాలని తెలిపారు. వారికి వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రత గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏదైనా కారణం చేత మాత్రలు అందని పిల్లలకు 18వ తేదీన మాప్ అప్ డే రోజు మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్. ఫాతిమా, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



గడివేములలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

● పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులే ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం గడివేముల జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న ఎమ్మెల్సీ పోలింగ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లు పోలింగ్‌లో ఉత్సహంగా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి,నంద్యాల జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షుడు శిరప శ్రీనివాసరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీలు మహేశ్వరరెడ్డి, సైమన్, సర్పంచ్‌లు నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, క్రిష్టారెడ్డి, వెంకట క్రిష్టారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రఘుమాధవరెడ్డి, ఎల్లారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రమేష్, పుల్లయ్య, డాలుస్వామి, బాలచెన్ని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుడి కల్యాణం



యాగంటిలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



దోన్‌లో వేంకటేశ్వరుడి కల్యాణోత్సవ దృశ్యం

బనగానపల్లె: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు, ఆయన వియ్యంకులు పెద్దిసాయిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులచే రుద్రహోమం, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం కల్యాణం అనంతరం పల్లకీ సేవ జరిగింది. కార్యక్రమంలో కాటసాని ఓబులరెడ్డి, ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

డోన్ టౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వెలసిన శ్రీగోదాదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. దేవాలయం నిర్మించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గత మూడు రోజులుగా జరుగుతున్న రజతోత్సం, వార్షిక బ్రహ్మోత్సావాల్లో భాగంగా సోమవారం ఆలయం ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు.

నేడు శ్రీలక్ష్మీ మాధవుడి రథోత్సవం

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్లలో శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవాదాయ శాఖాధికారులు, గ్రామ పెద్దలు పూర్తి చేశారు. కాగా స్వామి రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేదపండితులు రథారోహణం కార్యక్రమం నిర్వహించారు.